సాక్షి
జనగామ
సోమవారం। 15 జనవరి। 2024





హేమంత కాంతులు

వాడవాడలా భోగిమంటలు
నేడు మకర సంక్రాంతి

'కీడును తొలగించే భోగి మంటలు. శరీరాన్ని దృఢపర్చిన బొడబొడికెల స్నానాలు. ఘుమఘుమలాడిన పిండి వంటలు. నేలమ్మకు వన్నెలద్దిన రంగవల్లులు. నూతనత్వాన్ని తెచ్చిన కొత్త దుస్తులు. హరిదాసుల సంకీర్తనలు. గంగిరెద్దుల విన్యాసాలు. సంప్రదాయాన్ని ప్రతిబింబించిన జాతరలు. అంబరాన్నంటిన గోదారంగనాథుల కల్యాణాలు. సంక్రాంతి వచ్చింది హేమంత కాంతులతో'.. మూడు రోజుల వేడుకల్లో భాగంగా ఆదివారం భోగి పండుగను వైభవంగా జరుపుకున్న ప్రజలు సోమవారం మకర సంక్రాంతి వేడుకలకు సన్నద్ధమయ్యారు.

న్యూస్‌రీల్

ఘనంగా మల్లన్న బోనాలు



లింగాలఘణపురం: మండల కేంద్రంలోని గౌడ సామాజిక వర్గానికి చెందిన కులస్తులు సంక్రాంతి పండుగ సందర్భంగా ఆదివారం మల్లన్న దేవుడికి ఘనంగా బోనాలు చేశారు. కుల పెద్దమనుషులు బోయిని స్వామి (శివ్వాలు), బెజ్జం ఆంజనేయులు ఆధ్వర్యంలో భక్తి శ్రద్ధలతో మల్లన్న గుడి వద్దకు బోనాలతో వెళ్లి పట్నం చేసి నైవేద్యం సమర్పించారు. పాడిపంటలు సంవృద్ధిగా పండాలని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎడ్ల రాజు, బోయిని జంపయ్య, బెజ్జం చంద్రయ్య తదితరులు ఉన్నారు.

దేవరుప్పులలో బంజర మల్లన్నకు..

దేవరుప్పుల: సంక్రాంతి పండుగను పురస్కరించుని బంజర మల్లన్నకు జోగు బ్రదర్స్ ఆధ్వర్యంలో జాతర ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఆదివారం మండలంలోని పెద్దమడూరుకు చెందిన మాజీ ఎంపీటీసీ జోగు భిక్షపతి పర్యవేక్షణలో భక్తులు కుటుంబ సమేతంగా ఆలయానికి చేరుకుని బోనాలు, మొక్కులు సమర్పించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నిర్వాహకులు వసతులు కల్పించారు. బందోబస్తు నిర్వహణకు వచ్చిన ఎస్సై కొంగరి శ్రవణ్‌కుమార్, ఏఎస్సై సదానందం,సిబ్బంది మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో జోగు సోమయ్య, నర్సయ్య, కైలాసం, కొమురయ్య, కుమార్, నర్సింహా, రాములు, రవి, పాండు, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

'చట్టసభల్లో బీసీల వాటా సాధిస్తాం'



పాలకుర్తి టౌన్: సకల సామాజిక రంగాల్లో తీవ్ర అన్యాయానికి గురవుతున్న బీసీ ప్రజల విముక్తి చట్ట సభల్లో వాటాతోనే సాధ్యమవుతుందని ఆలిండియా ఓబీసీ జాక్ చైర్మన్ సాయిని నరేందర్ అన్నారు. ఆదివారం పాలకుర్తిలో బహుజన కులాల ఐక్య వేదిక అధ్యక్షుడు గుమ్మడిరాజుల సాంబయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి నరేందర్ హాజరై మాట్లాడారు. నిజాం నిరంకుశ పాలనను ఎదురించి పోరాటం చేసిన ధీశాలి చాకలి ఐలమ్మ యోధుల స్ఫూర్తితో బీసీల వాటా సాధిస్తామన్నారు. అనంతరం హిందూ బీసీ మహాసభ అధ్యక్షుడు బత్తుల సిద్దేశ్వర్లు చట్ట సభల్లో బీసీల వాటితోనే అభివృద్ధి జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో చపార్తి కుమార్ గాడ్గే, సంగి వెంకన్న, ఓబీసీ రాష్ట్ర నాయకులు పులి గణేష్, రజక సంఘం జిల్లా నాయకులు మదార్, పోశాల వెంకన్న, కమ్మగాని వెంకశ్వర్లు, కారుపోతుల శ్రీనివాస్, వీరమల్ల రాజు, ఎడవెల్లి సోము తదితరులు పాల్గొన్నారు.

రఘునాథపల్లిలో..

రఘునాథపల్లి: చట్టసభల్లో బీసీ వాటా సాధించేందుకు కలిసికట్టుగా ముందుకు రావాలని ఆల్ ఇండియా ఓబీసీ జాక్ చైర్మన్ సాయిని నరేందర్ పిలుపు నిచ్చారు. ఆదివారం మండలంలోని ఖిలాషాపూర్ సర్వాయి పాపన్న కోటను సంఘం నాయకులతో కలిసి సందర్శించారు. త్వరలో నిర్వహించనున్న బీసీల మహా పాదయాత్రను విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు మేకపోతుల నరేందర్, రాష్ట్ర నాయకులు వంగ రాములుగౌడ్, బత్తుల సిద్దేశ్వర్లు, అశోక్, బొంగు వెంకటేష్, మహేష్‌గౌడ్, శ్రీహరిగౌడ్, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

దేవరుప్పుల: ఐక్య పోరాటాలతోనే బీసీలకు సామాజిక న్యాయం చేకూరుతుందని ఆల్ ఇండియా ఓబీసీ జాక్ చైర్మన్ సాయిని నరేందర్ అన్నారు. ఆదివారం మహావీరుల సన్నిధిలో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమురయ్యతోపాటు పలువురికి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు వంగ రాములు, సిద్దేశ్వర్, అశోక్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ముత్యాల లోగిలి.. సంక్రాంతి జాబిలి



పట్టణంలో ముగ్గు వేస్తున్న యువతులు

జనగామ: అజ్ఞానాన్ని.. అహాన్ని.. మంటల్లో వేసి భోగిని సంబురంగా జరుపుకున్నారు. రంగురంగుల రంగవల్లులతో తీర్చి దిద్దిన వాకిళ్లు.. అందులో అలంకరించిన గొబ్బెమ్మలు.. పట్టు పరికిణీల రెపరెపలు.. పొంగళ్ల ఘుమఘుమలు.. తెలుగు వాకిళ్లలో ప్రకాశించే బంగారు ధాన్యపు రాశులతో ఊళ్లలో భక్తి పారవశ్యం నెలకొంది. చిన్నారులపై చిలకరించే ఆశీస్సుల భోగిపండగ ప్రతి ఇంటిలో కనిపించింది. 'భోగి' పండగతో కొత్త జీవితాన్ని ప్రారంభించారు. కూతుళ్లు.. అల్లుల్లు.. మనువలు.. మనువరాళ్లు.. బంధువులు.. ఆత్మీయుల సందడితో వేడుకలు అంబరాన్నంటాయి. హరిదాసుల కీర్తనలు, గంగిరెద్దుల మేళాల చప్పుళ్లతో గ్రామాల్లో ఉత్సాహ భరితమైన వాతావరణం తలపించింది.

భక్తి శ్రద్ధలతో భోగి పండగ

జిల్లాలో ఆదివారం జరిగిన భోగి పండగను ప్రజలు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. తెల్లవారు జామున ఇంట్లోని పాత కర్రపుల్లలు, పిడకలు, కర్రలతో భోగి మంటలను వేశారు. నూతన వస్త్రాలను ధరించి, సూర్యునికి ఇష్టమైన పాయసం తయారు చేసి నైవేద్యం సమర్పించారు. ఏ బాధలు ఉన్నా తొలిగిపోవాలని వేడుకున్నారు. సాయంత్రం చిన్న పిల్లలకు భోగి పళ్లను పోసి ఆశీర్వదించారు. గంగిరెద్దులకు వస్త్రాలు.. బియ్యం దానం చేసి భక్తిని చాటుకున్నారు. హరిదాసు కట్నకానుకలను సమర్పించి..



భోగి మంటల వద్ద పట్టణ వాసులు

నేటి మకర సంక్రాంతికి స్వాగతం పలికారు. జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండు, వీవర్స్ కాలనీ, నెహ్రూపార్కు, వెంకన్నకుంట, అంబేడ్కర్‌నగర్, జీఎంఆర్ కాలనీ, శ్రీ నగర్ కాలనీ, బాణాపురం తదితర కాలనీల్లో భోగిమంటలను కాల్చి.. తమలోని చెడుకు వీడ్కోలు పలికి.. మంచిని స్వాగతించారు. జిల్లాలో వలస వచ్చిన ఆంధ్ర కుటుంబాలు తమ రాష్ట్రంలో బాహాటంగా జరిగే కోళ్లపందెల ఆటలను రహస్యంగా ఆడినట్లు విశ్వసనీయ సమాచారం.

వేడుకగా గోదారంగ నాథుల కల్యాణం

భోగి పండగ సందర్భంగా జిల్లా కేంద్రంలోని బాణాపురం శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంతో పాటు రైల్వేస్టేషన్ ఏరియాలోని శ్రీ చెన్నకేశ్వర, బాణాపురం శ్రీ అంజనేయ స్వామి ఆలయంలో గోదాదేవి కల్యాణ వేడుకలు వైభవంగా జరిగాయి.

విభిన్నమైన పండుగ



హన్మకొండ కల్చరల్: సంక్రాంతి పండుగ ఎంతో భిన్నమైనది. అన్ని పండుగల మాదిరిగా తిథివారాలతో సంబంధం ఉండదు. కాలగమనంలో ఒక రాశి నుంచి మరొక రాశిలోకి సూర్యుడు మారుతుంటాడు. దక్షిణాయనం నుంచి ఉత్తరాయణంలోకి ప్రవేశిస్తాడు. మకర రాశిలో సూర్యుడు ప్రవేశించిన రోజును మకర సంక్రాంతి అంటారు. ప్రధానంగా రైతుల పంటలకు సంబంధించిన పండుగ. దక్షిణాయనంలో చనిపోయిన వారు ఉత్తరాయణం వచ్చేవరకు భూలోకంలో ఉండి ఉత్తరాయణంలో స్వర్గ ద్వారాలు తెరిచిన తర్వాత వెళ్తారని హిందువుల నమ్మకం. ఒకప్పుడు కవులు రచయితలు తమ రచనలతో సంక్రాంతి పండుగ అంటే ఆంధ్ర ప్రాంతంలోనే బాగా జరుపుకుంటారని భావన తెచ్చినప్పటికీ వాస్తవానికి తెలంగాణలో గొబ్బెమ్మలు, ముగ్గులు, నోములు, బోనాలు, అరిసెలు, సకినాలు, పతంగులతో జరుపుకునే సంక్రాంతి ఎంతో విభిన్నమైనది.

మల్లన్న బోనాలు ప్రత్యేకం



సంక్రాంతి పిల్లలకు సంతోషాన్ని కలిగించే వేడుక. మా ఇంట్లో భోగిరోజు కొమురవెల్లి మల్లన్న బోనాలు చేసుకున్నాం. రెండు దొంతరలుగా ఉన్న మూడు పాత్రల్లో పసుపన్నం, నూనె వేయకుండా పోపు వేయని ఐదు కూరగాయలతో కలిపి వండిన శాఖం, నిప్పులపై కాల్చిన మిరపకాయలతో చేసిన పచ్చిపులుసు, బెల్లం అన్నం, బెల్లం శాక, చల్ల పోస్తాం. పాత్రలను బంతి పూలతో అందంగా అలంకరించి మల్లన్నకు నివేదించాం. ప్రతిసంవత్సరం మల్లన్న కల్యాణం జరిపిస్తాం.

– బాలబోయిన రమాదేవి, కవయిత్రి, గోపాల్‌పూర్, హనుమకొండ

సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీక



పచ్చని వాకిళ్లలో పరుచుకున్న రంగవల్లులు/గొబ్బెమ్మలు శుభాలను కుమ్మరించి నవధాన్యాలు రాశులై ఒలికి../నవరసాలను నీబతుకులో కలగలిపి రేగుపండ్ల రుచులను బంతిపూల నవ్వులను పంచుతూ../గుమ్మాల మామిడి తోరణాల కళకళలు నట్టింట్లో బోగిపండ్లు పాలకాయల జల్లులతో మురిసే../పసినవ్వుల పసిడిల ఏ తెంచే సంక్రాంతి లక్ష్మి../మన సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీకలే మన పండుగలు../పాటించాలి ముందు తరాలు మన దేశకీర్తికి వారసులై../అపుడు వర్ధిల్లు మన భారతావని ఎల్లెలెరుగని భోగభాగ్యాలతో..

– వకుల వాసు, కవయిత్రి, సుబేదారి, హనుమకొండ

పండుగలకు పేద, ధనిక తేడా లేదు



పండుగ రోజు పేద, ధనిక తేడా లేకుండా ప్రతి ఇళ్లు పిండివంటలతో ఘుమఘుమలాడుతుంటాయి. పండగలంటే సంప్రదాయాలకు వారధిలాంటివి, ఆ వారధులను చెల్లాచెదురు కాకుండా చూసుకున్నప్పుడే భవిష్యత్ తరాలకు వాటి ప్రాముఖ్యతను అందించిన వాళ్లమవుతాం.

– గట్టు రాధిక కవయిత్రి, పోచమ్మకుంట హనుమకొండ

పండుగ ఉత్సాహాన్ని పిల్లలకు అందించాలి



ప్రస్తుతం యాంత్రికజీవనంలో పండుగ ఆనందం కాస్త కరువవుతుందనే చెప్పాలి. భవిష్యత్ తరాలకు ఆచార సంప్రదాయాలు నేర్పించడం వల్ల ఆరోగ్యకరమైన వాతావరణం నెలకొంటుంది. పండుగ ఉత్సాహ వాతావరణాన్ని పిల్లలకు, వారి పిల్లలకు అందించడం మన కర్తవ్యం.

– మెరుగు అనురాధ, కవయిత్రి, రెడ్డికాలనీ

మమ్మేలు మల్లన్న..

- ఐలోని క్షేత్రానికి పోటెత్తిన భక్తులు
- స్వామివారికి ప్రత్యేక పూజలు



మల్లికార్జునస్వామికి హారతి ఇస్తున్న అర్చకుడు



ఆలయ ప్రాంతంలో భక్తులు

ఐనవోలు: తెలంగాణలో ప్రముఖ శైవక్షేత్రాల్లో ఒకటిగా విరాజిల్లుతున్న ఐనవోలు శ్రీమల్లికార్జునస్వామి ఆలయంలో భోగి పర్వదినాన్ని ఆదివారం వైభవోపేతంగా నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వేలాదిగా భక్తులు ఐనవోలుకు చేరుకుని స్వామి, అమ్మవార్లను దర్శించుకుని మల్లన్న ఆశీర్వాదంతో తన్మయత్వం పొందారు. వేలాదిగా తరలి వచ్చిన భక్తులు వారి ఆచారం ప్రకారం మొక్కులు తీర్చుకున్నారు. 'మల్లన్న.. మమ్మేలు' అంటూ వరాలు పట్టారు.

ఘనంగా భోగి ఉత్సవాలు..

ఐనవోలు శ్రీమల్లికార్జునస్వామి దేవాలయంలో భోగి ఉత్సవ పూజలు ఘనంగా నిర్వహించారు. దేవాలయంలో ఉప ప్రధాన అర్చకులు పాతర్లపాటి రవీందర్, శ్రీనివాస్, పురోహితులు మధుకర్ శర్మ, వేద పారాయణదారు గట్టు పురుషోత్తమశర్మ, విక్రాంత్ వినాయక్ జోషి ప్రత్యేక పూజలు చేశారు. పుణ్యాహవచనం అనంతరం స్వామివారికి, దేవేరులకు పట్టు వస్త్రాలు ధరింప చేసి ఆభరణాలు అలంకరించారు. తర్వాత స్వామివారి గర్భాలయంలో ఏకాదశ రుద్రాభిషేకం కన్నుల పండువగా నిర్వహించారు.

మల్లన్నను దర్శించుకున్న ప్రముఖులు..

ఐనవోలు శ్రీమల్లికార్జునస్వామి జాతర ఉత్సవాల్లో భాగంగా భోగి పర్వదినాన్ని పురస్కరించుకుని ఎమ్మెల్సీలు బండా ప్రకాష్, బస్వరాజ్ సారయ్య, స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, మాజీ ఎమ్మెల్యేలు అరూరి రమేష్, డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్ రావు, ఎంపీపీ మధుమతి హాజరు కాగా ప్రముఖులందరికీ ఈ ఓ అద్దంకి నాగేశ్వర్‌రావు, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. స్వామివారిని దర్శించుకున్న అనంతరం వేద పండితులు ప్రముఖులకు ఆశీర్వచనంతో పాటు స్వామివారి శేషవస్త్రాలు అందించి సన్మానించారు.

నేడు మకర సంక్రాంతి ప్రత్యేక పూజలు

మకర సంక్రాంతి పర్వదినం సందర్భంగా సోమవారం దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, మ హానివేదన, మంత్ర పు ష్పం తదితర కార్యక్రమాలతో పాటు రాత్రి స్వామి వారి రథోత్సవం, ప్రభ బండ్లు తిరగడం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తారు.

వైభవంగా గోదాదేవి కల్యాణం





పాలకుర్తి టౌన్: గోదాదేవి కల్యాణంలో పాల్గొన్న భక్తులు, చిల్పూరులో..

పాలకుర్తి టౌన్: మండలంలోని వల్మిడి శ్రీ సీతారామచంద్ర స్వామి దేవాలయంలో ఆదివారం శ్రీరంగనాయక గోదాదేవి కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. శ్రీరమాసహిత సత్యనారాయణ స్వామి వ్రతంలో భక్తులు పాల్గొని స్వామి వారి కల్యాణాన్ని కనులార తిలకించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో ఆలయం సందడిగా మారింది. ఈ సందర్భంగా భక్తులకు మహాఅన్నదానం నిర్వహించారు. ఆలయ ఈఓ భాగం లక్ష్మిప్రసన్న ఏర్పాట్లను పర్యవేక్షించారు.

చిల్పూరు బుగులు వేంకటేశ్వరస్వామి ఆలయంలో..

చిల్పూరు: చిల్పూరుగుట్ట బుగులు వేంకటేశ్వరస్వామి సన్నిధిలో ఆదివారం గోదారంగనాయకస్వామి కల్యాణం ఘనంగా నిర్వహించారు. ఆలయ ఈఓ భాగం లక్ష్మిప్రసన్న ఆధ్వర్యంలో అర్చకులు రవీందర్‌శర్మ, రంగాచార్యులు, కృష్ణమాచార్యులు, వీరన్న శర్మ వేద మంత్రాల నడుమ అంగరంగ వైభవంగా జరిగింది. కల్యాణంలో శాశ్వత ఆలయ అభివృద్ధి దాత పొట్లపల్లి శ్రీధర్‌రావు- కిరణ్మయి, గుల్లెపల్లి శ్రీనివాస్-భవాని, సంగోజు మోహనాచారి-మణెమ్మ, రఘువీర్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ చిర్రనాగరాజు, కుంచాల సంపత్‌రాజు, శ్యాంసుందర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు. భక్తులకు సిద్ధిపేట జిల్లాకు చెందిన తిప్పరవేణి స్వాతి-యాదగిరి, పద్మ-భిక్షపతిలు అన్నప్రసాదం అందజేశారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన లహరితో ప్రిన్సిపాల్, పీడీ

స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని నమిలిగొండలోని మోడల్‌స్కూల్‌కు చెందిన 8వ తరగతి విద్యార్థి లహరి రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికై నట్లు కళాశాల ప్రిన్సిపాల్ కె.శ్రీకాంత్ తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల జనగామలో జరిగిన ఎస్‌జీఎఫ్-అండర్ 14 బాలికల కబడ్డీ పోటీల్లో ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి పాల్గొని ఉత్తమ ప్రతిభతో రాష్ట్రస్థాయికి ఎంపికై నట్లు తెలిపారు. ఈనెల 16, 17వ తేదీల్లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటుందన్నారు. కాగా రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన లహరిని ప్రిన్సిపాల్ శ్రీకాంత్, పీడీ సీహెచ్.అశోక్, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

సౌత్ జోన్ షూటింగ్ బాల్ పోటీల్లో ప్రతిభ

చిల్పూరు: ఈనెల 13 నుంచి 14వ తేదీ వరకు ఏపీలోని విజయవాడలో జరిగిన సౌత్ జోన్ షూటింగ్ బాల్ పోటీల్లో చిన్నపెండ్యాల గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న సంగీత పాల్గొని రెండో స్థానాన్ని కైవసం చేసుకున్నట్లు హెచ్‌ఎం సంపత్, పీఈటీ వంశీలు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

గెలుపోటములు సహజం

- ఎమ్మెల్యే కడియం శ్రీహరి
- చాగల్లులో ముగిసిన రాష్ట్రస్థాయి కబడ్డీ క్రీడాపోటీలు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి

స్టేషన్‌ఘన్‌పూర్: క్రీడాపోటీల్లో గెలుపు, ఓటమిలు సహజమని, క్రీడాకారులు క్రీడాస్ఫూర్తితో వ్యవహరిస్తూ ఓటమిని గెలుపుకు నాందిగా చేసుకోవాలని ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. మండలంలోని చాగల్లు గ్రామంలో కడియం ఫౌండేషన్ సహకారంతో తెలంగాణ రాష్ట్ర, జనగామ జిల్లా కబడ్డీ అసోసియేషన్‌ల అనుమతితో స్వాగత్‌యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి కబడ్డీ టోర్నమెంట్స్ ఆదివారం ముగిసాయి. ఫైనల్ పోటీలు జనగామ, సూర్యాపేట జట్ల మధ్య హోరాహోరీగా సాగాయి. అనంతరం కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు, చాగల్లు గ్రామ సర్పంచ్ పోగుల సారంగపాణి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. చాగల్లు గ్రామం కబడ్డీకి కేరాఫ్‌గా మారిందని, గ్రామం నుంచి ఎందరో రాష్ట్ర, జాతీయ స్థాయికి ఎదగడం సంతోషకరమన్నారు. ఘన్‌పూర్‌లో స్టేడియం అసంపూర్తిగా ఉందని, త్వరలో దానిని పూర్తి చేయించి ప్రారంభించేలా చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే హామీ చేశారు. అనంతరం రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో ప్రథమస్థానంలో సూర్యాపేట జట్టు (రూ.60 వేలు), ద్వితీయ జనగామ (రూ.40 వేలు)తో పాటు మరికొన్ని గెలుపొందిన జట్లకు బహుమతులు అందించారు.ఈ కార్యక్రమంలో కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పోగుల సారంగపాణి, ఉపసర్పంచ్ పొన్న రజితరాజేష్, నాయకులు గన్ను నర్సింహులు, బూర్ల శంకర్, మారుడోజు రాంబాబు, కందుల గట్టయ్య, పొన్న రాజేష్, అంబటి కిషన్‌రాజ్, జీడి రమేష్, ముక్కెర రవి, కనకం రమేష్, స్వాగత్ యూత్ అధ్యక్షుడు కూన రాజు, అన్నెపు కుమార్, చింతకింది సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

మల్లన్నకు యాదవుల బోనాలు

- సంక్రాంతి వేళ కులస్తుల ప్రత్యేకత
- తరతరాల నుంచి వస్తున్న సంప్రదాయం

జఫర్‌గఢ్ : సంక్రాంతి పండుగ సందర్భంగా మండలంలోని ఆయా గ్రామాల్లోని యాదవ కులస్తులది ఒక ప్రత్యేకత. ఈ పండుగ సందర్భంగా యాదవులు అత్యంత భక్తిశ్రద్ధలతో ఐనవోలు మల్లన్నను కోరికలు తీర్చే కొంగుబంగారంగా కొలుస్తుంటారు. తరతరాల నుంచి వస్తున్న ఆనవాయితీ ప్రకారం యాదవులు సంక్రాంతి పండగకు పక్షంరోజుల ముందుగానే తమ ఇండ్లకు సున్నాలు వేస్తారు. అనంతరం ఇండ్లను శుభ్రం చేసి పిండి వంటలు తయారు చేస్తారు. సాయంత్రం సమయంలో యవకులు, పెద్దలు కలిసి డోలు వాయిద్యాలతో మల్లన్న దేవుడిని కీర్తిస్తూ నృత్యాలు చేస్తూ పాటలు పాడుతుంటారు. సంక్రాంతి పండుగ రోజున అత్యంత భక్తి శ్రద్ధలతో ఉదయాన్నే మహిళలు తమ ఇళ్లల్లోనే ఐనవోలు మల్లన్నకు బోనాలు సమర్పించి మొక్కులు చెల్లిస్తారు. సాయంత్రం వేళ యాదవ కులస్తులు పిల్లలతో మొదలుకొని యువకులు, పెద్దలు గజ్జెల లాగులు ధరించి కాళ్లకు గజ్జెలు కట్టుకొని కండ్లకు రంగు రంగుల అద్దాలు ధరించి ఒంటిపై వలలను కప్పుకొని డోలు వాయిద్యాలు, మేళతాళాల చప్పుట్ల నడుమ నృత్యాలు చేసుకుంటూ ఊరేగింపుగా ఐనవోలు మల్లన్న జాతరకు బయలుదేరుతారు. ఊరేగింపునకు ముందు శివసత్తులకు మహిళలు మంగళహారతులు పట్టి తమ భక్తిని చాటుకుంటారు. మరికొంత మంది ఎడ్ల బండ్లను రంగు రంగుల వస్త్రాలతో అలంకరించి ఐనవోలు మల్లన్న తీర్థానికి బయలుదేరడం ఆనవాయితీ. వివిధ పురవీధుల గుండా సాగే యాదవ కులస్తుల ఊరేగింపును చూసేందుకు ఆయా గ్రామాల్లో ప్రజలు అధిక సంఖ్యలో తరలివస్తారు. అనంతరం అదే రోజు రాత్రి పలు వాహనాల్లో తరలి వెళ్లి ఐనవోలు మల్లన్నను దర్శించుకుని అక్కడ స్వామి వారికి మొక్కులు సమర్పించి నిద్ర చేస్తారు. మరుసటి రోజు తిరిగి ఎవరి ఇంటికి వారు చేరుకుంటారు. ఇది తమ తాత ముత్తాతల కాలం నుంచి వస్తున్న సంప్రదాయాన్ని యాదవ కులస్తులు కొనసాగిస్తూ తమ ప్రత్యేకతను చాటుకుంటున్నారు.


తిమ్మంపేటలో యాదవ కులస్తుల ఊరేగింపు(ఫైల్)

చిట్టీల పేరుతో మోసం..

కార్పొరేటర్ బాలిన సురేష్ అరెస్టు
- నిందితుడి వద్ద నుంచి రూ. 1.15 కోట్లు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన ఇంతేజార్ గంజ్ సీఐ పవన్‌కుమార్

రామన్నపేట : చిట్టీల పేరుతో ప్రజలను మోసం చేసిన వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ 26వ డివిజన్ కార్పొరేటర్ బాలిన సురేష్‌ను ఆదివారం అరెస్టు చేసి, అతడి వద్ద నుంచి రూ. కోటి 15 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఇంతేజార్‌గంజ్ సీఐ ఎల్. పవన్‌కుమార్ తెలిపారు. సీఐ కథనం ప్రకారం ..కార్పొరేటర్ బాలిన సురేష్ కమిట్‌మెంట్ చిట్టీల పేరుతో వరంగల్, హనుమకొండకు చెందిన సుమారు 100 మంది సభ్యుల నుంచి రూ. 6 కోట్లు వసూలు చేసి డబ్బులు ఇవ్వకుండా మోసం చేశాడు. కాగా ఈ నెల 10వ తేదీన బాధితులు గౌతమ్, గాలిపల్లి శ్రవణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శనివారం తిలక్‌నగర్‌లో అద్దె ఇంట్లో సురేష్‌ను అరెస్టు చేసి, రూ.1.15 కోట్లు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ పేర్కొన్నారు. సురేష్ 10 సంవత్సరాల నుంచి రూ. లక్ష, రెండు, ఐదు, రూ. పది లక్షల విలువైన కమిట్‌మెంట్ చిట్టీలు నడుపుతూ చాలా మందిని నమ్మించి నాలుగు సంవత్సరాలం క్రితం జరిగిన కార్పొరేషన్ ఎన్నికలు, సొంత ఇంటి నిర్మాణానికి చిట్టీలు వేసిన సభ్యుల డబ్బును వినియోగించుకున్నట్లు సీఐ వివరించారు. బాధితులు చిట్టీ డబ్బులు అడిగిన సందర్భాల్లో వారిని మభ్యపెడుతూ కాలం గడుపుతూ వస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు. ఈ క్రమంలో తన ఇంటిని అమ్మి రుణం చెల్లించాడు. కొన్ని అప్పులు తీర్చి మిగతా డబ్బును తన దగ్గర పెట్టుకున్నట్లు తెలిపారు. అరెస్టు చేసిన అనంతరం నిందితుడిని కోర్టులో హాజరుపర్చినట్లు సీఐ పవన్‌కుమార్ తెలిపారు.

రేషన్ బియ్యం స్వాధీనం

- వాహనంతో పాటు బియ్యం సీజ్
- ఇద్దరిపై కేసు నమోదు, డ్రైవర్ అరెస్ట్


పట్టుబడిన బియ్యం, ట్రాలీతో పోలీసులు

కమలాపూర్ : అక్రమంగా తరలిస్తున్న 18 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని మండలంలోని ఉప్పల్ రైల్వే గేట్ సమీపంలో స్వాధీనం చేసుకున్నట్లు హెడ్ కానిస్టేబుల్ వి.కుమారస్వామి తెలిపారు. మండలంలోని ఉప్పల్‌లో ఆదివారం పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా రైల్వే గేట్ సమీపంలో టీఎస్ 02 యూఏ 2127 నంబరు గల ట్రాలీలో రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తూ డ్రైవర్ అనుమానాస్పదంగా కనిపించడంతో వాహనాన్ని తనిఖీ చేశామన్నారు .కాగా, 40 బ్యాగుల్లో తరలిస్తున్న రూ.28 వేల విలువ గల 18 క్వింటాళ్ల రేషన్ బియ్యం ఉన్నాయని, వాటిని స్వాధీనం చేసుకుని వాహనాన్ని సీజ్ చేసి స్థానిక పోలీస్ స్టేషన్‌కు తరలించామన్నారు. దందాకు పాల్పడుతున్న మండలంలోని పంగిడిపల్లికి చెందిన ట్రాలీ డ్రైవర్ గుబిరె ఓంకార్, యజమాని ఆసాల రవీందర్‌పై కేసు నమోదు చేసి డ్రైవర్‌ను అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఊపిరాడక హమాలీ మృతి


మృతి చెందిన బుద్దన్ కుమార్

ధర్మసాగర్ : బియ్యం ట్యాంక్(బాయిలర్)లో బియ్యం కింద పడి ఊపిరాడక హమాలీ మృతి చెందిన ఘటన ఆదివారం ధర్మసాగర్ పోలీస్‌స్టేషన్ పరిధి కాజీపేట మండలంలోని రాంపూర్ శివారులో గల మారుతి ఆగ్రో ఇండస్ట్రీస్(రైస్ మిల్లు)లో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బిహార్ రాష్ట్రానికి చెందిన బుద్దన్ కుమార్(21) తో పాటు మరికొందరు రెండు నెలల క్రితం వచ్చి రైస్ మిల్లులో హమాలీ పని చేస్తున్నారు. ఈ క్రమంలో ఆదివారం ఇండస్ట్రీస్‌లో బియ్యం మర పడుతుండగా రైస్‌ట్యాంకు నుంచి బియ్యం కిందికి రావడంలేదని బుద్దన్ కుమార్ ట్యాంకు పైకి వెళ్లి అందులోకి దిగాడు. ఎక్కడైనా బియ్యం ఆగి ఉన్నాయా..అని ట్యాంకును చేతితో తడుతుండగా పైన ఆగిన బియ్యం ఒక్కసారిగా బుద్దన్ కుమార్ మీద పడ్డాయి. దీంతో అతను బియ్యం కింద మునిగి శ్వాసఆడక మృతి చెందాడు. మృతుడి సోదరుడు లాల్ బహదూర్ చౌదరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ శ్రీధర్‌రావు తెలిపారు.

ప్యారంకుంటలో పడి యువతి ..


లోహిత(ఫైల్)

ధర్మసాగర్ : పశువులు మేపేందుకు వెళ్లి ప్యారంకుంటలో మునిగి యువతి మృతి చెందిన సంఘటన మండలంలోని ఉనికిచర్ల గ్రామంలో శనివారం సాయంత్రం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. ఉనికిచర్ల చెందిన ఆక లోహిత(21) ఇంటి వద్దే ఉంటూ పోటీ పరీక్షలకు సిద్ధమవుతోంది. అయితే ఆమె తండ్రి శ్రీనివాస్ సొంత పనులకు శనివారం ముల్కనూర్‌కు వెళ్లగా ఇంటి వద్ద ఉన్న తమ గేదెలను మేపడానికి ఉనికిచర్ల శివారులోని ప్యారంకుంట వైపు వెళ్లింది. ఈ క్రమంలో సాయంత్రం వేళ గేదెలు ప్యారంకుంటలో నుంచి మరో పక్కకు వెళాయి. అటువైపున పొలంపని చేస్తున్న ఓ వ్యక్తి ఆ యువతికి ఫోన్ చేసి గేదెలను అటు వైపునకు తోలుతున్నానని చెప్పాడు. అనంతరం మరోసారి ఫోన్ చేయగా యువతి ఫోన్ ఎత్తలేదు. దీంతో అనుమానం వచ్చిన సదరు వ్యక్తి యువతి తండ్రికి ఫోన్ చేసి లోహిత ఫోన్ ఎత్తడం లేదని చెప్పగా ఇద్దరు కలిసి ప్యారంకుంట వద్దకు వెళ్లారు. కుంట కట్టపై యువతి చెప్పులు, కర్ర, లంచ్ బాక్స్, సెల్‌ఫోన్ కనిపించాయి. దీంతో వారు కుంటలోకి దిగి వెతకగా లోహిత మృతదేహం లభ్యమైంది. కాగా కుంటలోని గేదెలను ఇటువైపునకు తోలుకొని రావడానికి కుంటలోకి దిగగా ఈత రాకపోవడంతో ప్రమాదవశాత్తు నీట మునిగి మృతి చెంది ఉంటుందని ఆదివారం మృతురాలి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ శ్రీధర్‌రావు తెలిపారు.

చికిత్స పొందుతున్న మహిళ..


జ్యోతి (ఫైల్)

రేగొండ : పది రోజుల క్రితం జిల్లాలో సంచలనం సృష్టించిన సైకో దాడిలో గాయపడి చికిత్స పొందుతున్న మహిళ ఆదివారం మృతిచెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని తిరుమలగిరి గ్రామానికి చెందిన కంచరకుంట్ల రాజు ఈ నెల 5వ తేదీన అర్ధ రాత్రి తన తల్లి హైమ, పక్కింటి మహిళ ఊకంటి జ్యోతి(45)పై రోకలి కర్రతో దాడి చేశాడు. దీంతో అతడి తల్లి అక్కడికక్కడే మృతి చెందగా జ్యోతికి తీవ్ర గాయాలయ్యాయి. కాగా, తీవ్రగాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న జ్యోతి ఆదివారం మృతి చెందినట్లు ఎస్సై రవికుమార్ తెలిపారు.

జన్మదినం రోజే అనంతలోకాలకు..

- రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం
- మరో యువకుడికి తీవ్ర గాయాలు
- కమలాపూర్‌లో ఘటన


శివ (ఫైల్)

కమలాపూర్ : జన్మదినం రోజునే ఓ యువకుడు అనంత లోకాలకు చేరాడు. తన బర్త్‌డే వేడుకల్లో పాల్గొని ఇంటికి వెళ్తున్న క్రమంలో రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందాడు. ఈ ఘటన కమలాపూర్ మండలం కేంద్రంలో జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని వంగపల్లికి చెందిన నకీర్త శివ (20) కమలాపూర్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. ఆదివారం శివ ఇంట్లో మల్లన్న పట్నాలు వేశారు. అదేరోజు శివ పుట్టిన రోజు కూడా కావడంతో స్నేహితులు సాయంత్రం ఫోన్ చేసి పిలిచారు. దీంతో స్నేహితుల వద్దకు వెళ్లి బర్త్‌డే వేడుకల్లో పాల్గొన్నాడు. తిరిగి అదేరోజు రాత్రి ద్విచక్రవాహనంపై వంగపల్లిలోని తన ఇంటికి తిరిగి వెళ్తున్నాడు. ఈక్రమంలో కమలాపూర్‌లోని భారత్ పెట్రోల్ బంక్ వద్ద నడికూడ నుంచి కొత్తకొండకు వెళ్తున్న ట్రాక్టర్.. బైక్‌ను ఢీకొంది. ఈ ఘటనలో శివ అక్కడికక్కడే మృతి చెందగా అతడితో పాటు ద్విచక్రవాహనంపై ప్రయాణిస్తున్న కమలాపూర్‌కు చెందిన మరో యువకుడు అరుణ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే క్షతగాత్రుడిని 108లో వరంగల్ ఎంజీఎంకు తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని వివరాలు సేకరిస్తున్నారు.

రిటైర్డ్ ఎక్సైజ్ సీఐతో సహా 42మందిపై కేసు

కాజీపేట: హనుమకొండ పీఎస్ పరిధిలో తప్పుడు పత్రాలు సృష్టించి 2.20 ఎకరాల భూమిని రిజిస్ట్రేషన్ చేసుకున్న కేసులో రిటైర్ ఎక్సైజ్ సీఐ దిడ్డి నరేందర్‌తో పాటు 42 మందిపై కేసులు నమోదు చేసినట్లు సీఐ కరుణాకర్ తెలిపారు. బాధితుడు మందాటి వినోద్‌కుమార్ కోర్టును ఆశ్రయించడంతో న్యాయస్థానం ఆదేశం మేరకు నిందితులందరిపై కేసు నమోదు చేసినట్లు వివరించారు.

గంజాయి పట్టివేత

ధర్మసాగర్ : ధర్మసాగర్ పోలీస్ స్టేషన్ పరిధి కాజీపేట మండలంలోని రాంపూర్ ఇండస్ట్రియల్ ఏరియాలో స్థానిక పోలీసులు ఆదివారం 20.9 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకొని ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు సీఐ శ్రీధర్ రావు ప్రకటనలో తెలిపారు. బిహార్ రాష్ట్రానికి చెందిన చోటు కుమార్ ప్రస్తుతం హైదరాబాద్‌లో ఉంటున్నాడు. చోటుకుమార్ రాంపూర్ ఇండస్ట్రీయల్ ఏరియాలో అనుమానస్పదంగా తిరుగుతున్నాడు. అదే ఏరియాలో పెట్రోలింగ్ చేస్తున్న పోలీసులు అతని వద్ద ఉన్న బ్యాగులు తనిఖీ చేయగా 20.9 కేజీల గంజాయి పట్టుబడినట్లు తెలిపారు. చోటుకుమార్‌ను అదుపులోకి తీసుకొని విచారించగా గంజాయిని విశాఖపట్నం నుంచి తీసుకు వస్తున్నట్లుగా చెప్పాడని, అతడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్టు సీఐ పేర్కొన్నారు. గంజాయి విలువ సుమారు రూ.5,22,500 లక్షలు ఉంటుందన్నారు. సహకరించిన మరో ఇద్దరు పరారీలో ఉన్నారని సీఐ తెలిపారు. ఈ తనిఖీలో ఎస్సై నర్సింహారావు, పీసీలు సంపత్, కరుణాకర్, యాదగిరి ఉన్నారు.

చికిత్స పొందుతున్న యువకుడి మృతి

- భార్య, బంధువులే కారణమని మృతుడి సోదరుడు పోలీసులకు ఫిర్యాదు


అనిల్(ఫైల్)

సంగెం : చికిత్స పొందుతున్న ఓ యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని గవిచర్లలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన బాషిపాక అనిల్(36) అదే గ్రామానికి చెందిన సమీప బంధువైన ఏఎస్‌ఎం సుధను సుమారు 12 ఏళ్ల క్రితం ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. ఈ దంపతులకు కుమారుడు, కూతురు ఉంది. ఈ క్రమంలో వారి కాపురంలో కలహాలు ప్రారంభమయ్యాయి. దీంతో ఐదు నెలల క్రితం సుధ తన తల్లిగారింటికి వెళ్లింది. ఈ నెల 3వ తేదీన అనిల్.. సుధ పనిచేసే చోటుకు వెళ్లి కాపురానికి రమ్మని గొడవ పడ్డాడు. 4వ తేదీన సాయంత్రం అనిల్‌కు పిట్స్ వచ్చాయి. గమనించిన చెల్లెలు, స్థానికులు వెంటనే ఎంజీఎంకు తరలించారు. పరీక్షించిన వైద్యులు అనిల్ తల, చేతులకు తీవ్ర గాయాలయ్యాయని, ఆపరేషన్ చేయాలనడంతో హైదరాబాద్‌లోని ఉస్మానియాకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ అనిల్ ఆదివారం మృతిచెందాడు. అయితే ఈ ఘటనపై మృతుడి సోదరుడు ప్రభాకర్.. తన తమ్ముడి మృతికి అతడి భార్య సుధతో పాటు బండి శ్రీనివాస్, బాషిపాక రాజు, ఉపేంద్ర, ఏలియా, ప్రమీల, వేల్పుల కుమారస్వామి, మమతతో పాటు మరికొందరు కారణమని పోలీసులకు ఫిర్యాదు చేశారు. దాడి చేయడంతోనే తన తమ్ముడు మృతి చెందాడని, చర్యలు తీసుకోవాలని కోరాడు. ప్రభాకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై భరత్ పేర్కొన్నారు.